


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 22-01-2023 సంపుటి : 04 సంచిక : 133 పేజీలు : 4 వెల : రూ 3-00

# ప్రధాని మోడీ తెలంగాణ పర్యటన ఖరారు



న్యూఢిల్లీ,జనవరి21 : ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు షెడ్యూల్ ఖారారు అయింది. ఫిబ్రవరి 13న హైదరాబాద్‌కు మోదీ రానున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొని ప్రసంగించనున్నారు. వాస్తవానికి సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ట్రయిన్ ను ప్రారంభించడానికి ఈ నెల 19నే మోడీ తెలంగాణలో పర్యటించాల్సింది. కానీ అనివార్య కారణాలవల్ల పర్యటన రద్దు అయ్యింది. దీంతో అనుకున్న టైం కంటే ముందే ఈ నెల 15న సికింద్రాబాద్- వైజాగ్ వందేభారత్ ట్రయిన్‌ను మోడీ వర్చువల్ గా ప్రారంభించారు. దీంతో ఇపుడు మోడీ టూర్ ఖరారయ్యింది. అప్పుడు వాయిదా పడ్డ మోదీ టూర్‌ను వచ్చే నెలకు రీ షెడ్యూల్ చేశారు. తెలంగాణలో ఎన్నికలకు సమయం దగ్గర పడటం, ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశముందనే ప్రచారం నేపథ్యంలో మోదీ తెలంగాణ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. తెలంగాణపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టడం, వచ్చే ఎన్నికల్లో

### వచ్చేనెల 13న హైదరాబాద్‌కు రానున్నట్లు వెల్లడి
### సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణకు శంకుస్థాపన
### అదేరోజు పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ

అధికారంలోకి వచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న క్రమంలో.. జాతీయ నేతలు రాష్ట్రానికి వస్తున్నారు. ఈ నెలలో అమిత్ షా రానుడంగా.. వచ్చే నెలలో మోదీ వస్తున్నారు. పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభలో మోదీ ఏం మాట్లాడతారనేది హాట్‌టాపిక్‌గా మారింది. సీఎం కేసీఆర్ టార్గెట్‌గా విమర్శలు చేస్తారా..? కేంద్ర ప్రభుత్వంపై కేసీఆర్ చేసే ఆరోపణలకు సమాధానం చెబుతారా? అనేది చర్చనీయాంశంగా మారింది. గతంలో పలుమార్లు తెలం గాణ పర్యటనకు వచ్చిన సమయంలో సీఎం కేసీఆర్‌పై మోదీ విరుచుకుపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను గట్టిగా ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో తెలం గాణలో బీజేపీ అధికారంలోకి వస్తుం దంటూ కార్యకర్తలకు భరోసా కల్పించే ప్రయత్నం చేశారు. తెలంగాణలోని బీజేపీ కార్యకర్తలు బాగా పనిచేస్తున్నారంటూ మోదీ అనేకసార్లు ప్రశంసించారు. ఇలాగే పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని, పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేలా కృషి చేయాలన్నారు.

# రెండు నెలల్లో పరిపాలన రాజధానిగా విశాఖ.. టార్గెట్ ఐటీ హబ్: మంత్రి గుడివాడ



విశాఖపట్నం: ఏపీకి కాబోయే పరిపాలన రాజధాని విశాఖపట్నం గురించి ఐటీ మంత్రి గుడివాడ అమర్నాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మరో రెండు నెలల్లో విశాఖ ఏపీకి పరిపాలన రాజధాని కాబోతోందని, ఏదేమైనా ఈ ప్రాంతాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ మరోసారి ఉద్ఘాటించారు. విశాఖలో శనివారం రెండో రోజు ఇన్ఫినిటి వైజాగ్ సదస్సు జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో ఇన్ఫోసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. ''దేశంలోని ధనిక నగరాల్లో విశాఖ తొమ్మిదవ స్థానంలో ఉంది. త్వరలో అదాని డేటా సెంటర్‌ను ప్రారంభిస్తాం. విశాఖను ఐటీ హబ్ చేయడమే మా లక్ష్యం'' అని ఆయన ప్రకటించారు. ఈ సదస్సులో మంత్రి అమర్నాథ్‌తో పాటు పలువురు ఐటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# టిడిపి చలో నూతిమడుగు పిలుపు

### మంత్రి ఉషాశ్రీ చరణ్ భూ అక్రమాలపై ప్రదర్శన
### ఎక్కడిక్కడ టిడిపి నేతల అరెస్ట, గృహనిర్బంధం



అనంతపురం,జనవరి21:మంత్రి ఉషాశ్రీ చరణ్ భూ అక్రమాలపై టీడీపీ ఆందోళనకు దిగింది. క్షేత్రస్థాయి పరిశీలనకు బయలుదేరిన కళ్యాణదుర్గం టీడీపీ ఇన్చార్జ్ మాదినేని ఉమామహేశ్వర్ నాయుడుతో పాటు టీడీపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈక్రమంలో టీడీపీ నేతలు, పోలీసులకు మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. రిసార్ట్ మంత్రి రిజైన్ చేయాలని... మంత్రి చేసింది పి.హెచ్.డి కాదు చేసేది దోపిడీ అంటూ టీడీపీ నేతలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.నుతిమాడుగు గ్రామంలో టిడిపి నేతల పర్యటనను పోలీసులు అడ్డుకున్నారు. పలుచోట్ల ముందస్తు అరెస్టుతో నేతలను గృహనిర్బంధం చేశారు. మడకశిరలోని ముఖ్య టిడిపి నేతలను పోలీసులు ముందస్తుగా గృహ నిర్బంధం చేశారు. కనగనిపల్లి మండల పరిధిలోని నుతిమాడుగు గ్రామ సమీపంలో ఉన్న సుజీలన్ కంపెనీకి చెందిన భూములను ఉమ్మడి జిల్లాలలోని ముఖ్యమైన టిడిపి నాయకులు సందర్శించనున్నారని తెలియడంతో... శనివారం తెల్లవారుజామున మడకశిర పట్టణంలోని రాష్ట్ర టిడిపి నేతలు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ని నూతి మడుగు గ్రామానికి వెళ్లనీకుండా పట్టణ స్థానిక ఎస్సై నాగేంద్రప్ప, గుడిబండ ఎస్సైలు హౌస్ అరెస్ట్ చేసి నోటీసులిచ్చారు.కంబదూర్, కనగానపల్లి, పరిధిలోని నూతిమడుగు, భానుకోట, గ్రామ సమీపంలో సుజాలన్ కంపెనీకి చెందిన భూములను సందర్శించేందుకు చలో నూతిమడుగు కార్యక్రమాన్ని శనివారం చేపట్టింది. ఈ నేపథ్యంలో.. ఆయా చోట్ల ఉన్న ముఖ్య టిడిపి నేతలను పోలీసులు తెల్లవారుజాము నుండి ముందస్తు అరెస్టులు చేశారు. కొందరిని గృహనిర్బంధం చేశారు. సత్య సాయి జిల్లా, మడకశిర నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు మద్దనకుంట కె.ఈరన్నని ఉదయం 5 గంటలకు స్థానిక ఎస్ఐ హౌస్ అరెస్ట్ చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులను ఎలాగైనా ఆపాలని ముఖ్య నేతలను హౌస్ అరెస్ట్ చేయడం సిగ్గుచేటు అని నేతలు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మడకశిర పట్టణంలో చలో నూతిమడుగు కార్యక్రమానికి వెళ్లనీకుండా తెలుగుదేశం పార్టీ సత్యసాయి జిల్లా వైనార్టీ అధ్యక్షులు భక్తకి, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మనోహర్‌కి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణకి ముందస్తు నోటీసులను పోలీసులు అందజేశారు. కనగానపల్లి మండలం భానుగొట సమీపంలో ఉన్న సుజాలన్ కంపెనీకి చెందిన భూములను సందర్శించటానికి వెళుతున్న శ్రీసత్యసాయి జిల్లా టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు బీకే పార్థసారథిని, వారితోపాటు పలువురు నాయకులని కొండపల్లి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అరెస్టు చేసి ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# తిరుమలలో డ్రోన్ దృశ్యాల కలకలం.. స్పందించిన తితిదే ఛైర్మన్ సుబ్బారెడ్డి


తిరుమల: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని డ్రోన్ కెమెరాతో చిత్రీకరించిన ఇన్‌స్టాగ్రామ్ రీల్ శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో వ్యాపించడం కలకలం సృష్టించిన విషయం తెలిసిందే.ఈ అంశంపై తాజాగా తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్పందించారు. డ్రోన్ కెమెరాతో చిత్రీకరించిన ఇన్‌స్టాగ్రామ్ రీల్ హైదరాబాద్‌కు చెందిన సంస్థ సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేసినట్లు గుర్తించామన్నారు. సదరు సంస్థపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు. పటిష్ఠ భద్రత ఉన్న ఆలయంపై డ్రోన్‌తో చిత్రీకరించేందుకు అవకాశం లేదన్నారు. పాత చిత్రంతో యానిమేట్ చేశారా? అనే కోణంలో పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు సుబ్బారెడ్డి చెప్పారు. డ్రోన్ చిత్రాలు, దృశ్యాలపై భక్తులు ఆందోళన చెందాల్సిన పని లేదని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆగమశాస్త్రం ప్రకారం శ్రీవారి ఆలయంపై ఎలాంటి వస్తువులు ఎగరడానికి వీలులేదనే నిబంధన ఉంది. బేడి ఆంజనేయ స్వామి ఆలయం నుంచి పశ్చిమ మాఢవీధి వరకు



దృశ్యాలు చిత్రీకరించారు. శ్రీవారి ఆనంద నిలయం, ఆనంద నిలయ గోపురాలకు దగ్గరగా చిత్రీకరణ చేశారు. అయితే, నో ఫ్లై జోన్‌గా ఉన్న తిరుమలలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంతో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి.

# కెసిఆర్ క్షమాపణలు చెప్పాల్సిందే

### అప్పుడే ఎపిలోకి అడుగు పెట్టాలి
### మరోమారు డిమాండ్ చేసిన జివిఎల్




గుంటూరు,జనవరి21(: ఏపీ ప్రజలకు తెలంగాణ సిఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని బిజెపి రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మరోమారు డిమాండ్ చేశారు. క్షమాపణలు చెప్పిన తరవాతనే ఏపీలో రాజకీయాలు చేయాలని ఎంపీ అన్నారు. ఏపీ రాష్ట్ర ప్రజల ఆత్మాభిమానాన్ని కించపరిచేలా మాట్లాడిన కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా రైల్వే స్టేషన్‌లో ఎంపీ లాడ్స్ నిధులతో ఏర్పాటు చేసిన బెంచీలను ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..12 రైల్వేస్టేషన్‌లలో రూ.50 లక్షల ఎంపీ లాడ్స్‌తో ప్రయాణీకుల కోసం కుర్చీలు ఏర్పాటు చేశామన్నారు. రైల్వే రంగంలో మోదీ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నారని తెలిపారు.

# పవన్ కల్యాణ్‌పై పోటీకి సిద్ధం: మంత్రి కారుమూరి కీలక వ్యాఖ్యలు

ఏలూరు: రానున్న ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మంత్రి కారుమూరి నాగేశ్వర రావు తెలిపారు.చంద్రబాబు, లోక్‌శ్ బాబు ఎన్ని పాదయాత్రలు చేసినా ఒరిగేదేమిలేదని ఆయన స్పష్టం చేశారు.కాగా, మంత్రి కారుమూరి బుట్టాయగూడెంలో మీడియాతో మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలిసి పోటీచేసినా గెలుపు మాత్రం మాదే. 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుస్తుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మమ్మల్ని గెలిపిస్తాయి. రానున్న ఎన్నికల్లో పవన్ కల్యాన్ తణుకు నుంచి పోటీ చేస్తే పవన్‌పై పోటీ చేసేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. చంద్రబాబు, లోకేశ్ బాబు ఎన్ని పాదయాత్రలు చేసినా ఒరిగేదేమిలేదు. లోకేశ్ పాదయాత్రను ప్రజలు జోకర్‌లా చూస్తున్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సీఎం జగన్‌పై నమ్మకంతో ఉన్నారు అంటూ కామెంట్స్ చేశారు.



# 'అయ్యన్న పాత్రుడు సైకో, శాడిస్టు.. ఆయన చరిత్ర అందరికీ తెలుసు'





విశాఖపట్నం: టీడీపీ నేత అయ్యన్న పాత్రుడును ఏకి పారేశారు నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్. ఆయన ఒక సైకో, శాడిస్ట అని మండిపడ్డారు.చంద్రబాబు, లోకేష్‌లు పెద్ద సైకోలు అని ధ్వజమెత్తారు. అయ్యన్నపాత్రుడు చరిత్ర అందరికి తెలుసని, నర్సీపట్నంను గంజాయి అడ్డాగా మార్చిన చరిత్ర ఆయనదని విమర్శలు గుప్పించారు.'రాష్ట్రాన్ని దోచుకున్న దోపిడీ ముఠా చంద్రబాబు, అయ్యన్నపాత్రుడు. అయ్యన్న కంటే మేము బూతులు మాట్లాడగలము. అయ్యన్న నోరు అదుపులో పెట్టుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తామని చెప్పి మోసం చేశారు. జన్మభూమి కమిటీల్లా బ్రోకర్లలా కాకుండా వలంటీర్ల వ్యవస్థ పని చేస్తుంది. పొత్తులు లేకుండా ఎన్నికలకు వెళ్లే ధైర్యం చంద్రబాబుకు ఉందా? 175 స్థానాల్లో పోటీ చేసే ధైర్యం చంద్రబాబుకు ఉందా?ఓడిపోతామనే భయంతో అన్ని పార్టీల నేతల ఇంటికి అయ్యన్నపాత్రుడు తిరుగుతున్నారు. వెయ్యి మంది చంద్రబాబులు, లక్ష మంది అయ్యన్నపాత్రుడులు వచ్చినా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఏమీ చేయలేరు. రూ. 500 కోట్లతో మెడికల్ కాలేజీ ఇచ్చారు. రూ.470 కోట్లతో తాండవ ఏలేరు కాలువ నదులను అనుసంధానం చేశారు' అని ఉమా శంకర్ గణేశ్ వ్యాఖ్యానించారు.

# లోకేశ్ పాదయాత్రను అడ్డుకునే కుట్ర

### అనుమతి ఇవ్వకుండా తాత్సారంలో దురుద్దేశం
### టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న

విశాఖపట్నం,జనవరి21 : రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న పేర్కొన్నారు. లోకేష్ పాదయాత్ర అడ్డుకోవడానికి జీవో నెంబర్ వన్ తీసుకొచ్చారన్నారు. చంద్రబాబుకి, లోకేష్‌కి ప్రాణ హాని ఉందన్నారు. పాదయాత్రకు సంబంధించి డీజీపీకి ఎప్పుడో దరఖాస్తు చేశామని.. ఇప్పటికీ అనుమతి ఇవ్వలేదని బుద్దా వెంకన్న తెలిపారు. అనుమతి ఇచ్చినా ఇవ్వకపోయినా జనవరి 27న కుప్పం నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని.. దానిని ఆపితే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారన్నారు. కేంద్ర ప్రభుత్వం లోకేష్ పాదయాత్రకు ప్రత్యేక బలగాలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జీఓ నంబర్ 1ని ఉపసంహరించుకోవాలన్నారు. లోకేష్ పాదయాత్రకు డీజీపీ అనుమతులు ఇవ్వాలని బుద్దా వెంకన్న కోరారు. టీడీపీలో ఎవరూ ఎవరిని కించపరిచే విధంగా మాట్లాడలేదన్నారు. గంటా శ్రీనివాసరావును అయ్యన్న ఎక్కడా అగౌరపరిచే విధంగా మాట్లాడలేదని బుద్దా వెంకన్న పేర్కొన్నారు.



# సంపాదకీయం

ఆదివారం 22-01-2023

## ప్రచారమే ప్రధానమా....

ప్రధాని మోడీకి ఎన్నికల లబ్ధి వినా మరేం కనిపించడం లేదా? ఆఖరికి గణతంత్ర దినోత్సవాలను కూడా ఎన్నికలలో లబ్ధి చేకూర్చే కార్యక్రమంలా మార్చేస్తారా? అంటే పరిస్థితులు గమనిస్తుంటే ఔననే అనాల్సి వస్తోంది. బడుగులకు పెద్ద పీట వేయాల్సిందే.. ఎవరూ కాదనరు. వారి ఆదాయం పెంపునకు మార్గాలు చూపాలి. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. కానీ ఒక ఉత్సవానికి ముఖ్య అతిథిలను చేసేసి చేతులు దులిపేసుకుంటే సరిపోతుందా? కానీ మోడీ మాత్రం అలా చేస్తే చాలు ఓట్లు వాటంతటవే రాలుతాయని అంటున్నారుఈ ఏడాది గణతంత్ర దినోత్సవాలను బడుగులకు భాగస్వామ్యం థీమ్ తో నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ థీమ్ తో గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా గణతంత్ర స్ఫూర్తిని చాటుతున్నామని మోడీ సర్కార్ ఘనంగా ప్రచారం చేసుకుంటోంది. అంతే కాకుండా సాధారణంగా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో మొదటి వరుసలో కూర్చునే అవకాశాన్ని వీవీఐపీలకు ఇస్తారు. కానీ ఈ సారి బడుగుల భాగస్వామ్యం థీమ్ తో నిర్వహిస్తున్న ఈ గణతంత్ర దినోత్సవంలో మాత్రం ఆ అవకాశాన్ని రిక్షా కార్మికులు, తోపుడు బండ్ల వ్యాపారులకు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నికల వేళ బడుగుల ఓట్లకు గాలం వేయడానికి మోడీ సర్కార్ వేసిన కొత్త ఎత్తుగడగానే దీనిని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కరోనా కష్ట కాలంలో తోపుడు బండ్ల కార్మికులను ఆదుకోవడం కోసం అంటు ఘనంగా ప్రకటనలు గుప్పించినా ఆ తరువాత వారిని పూర్తిగా విస్మరించిన కేంద్రం ఇప్పుడు ఎన్నికల వేల ఓట్ల గాలం కోసం కొత్త కొత్త ఎత్తుగడలతో ముందుకు వస్తోందంటున్నారు. వీవీఐపీలకు కాకుండా రిక్షా కార్మికులు, కూరగాయలు అమ్మే చిరు వ్యాపారులకు కేటాయించినట్టు కేంద్రం స్పష్టం చేసింది. ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్–సిసి ఈ ఏడాది గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరౌతున్నారు. మొత్తం 45,000 మంది ఈ పెరేడ్ లో కూర్చునే సదుపాయం ఉంది. రాజ్ పథ్ రోడ్డును కర్తవ్యపథ్ గా పేరు మార్చాక జరుగుతున్ తొలి రిపబ్లిక్ డే పెరేడ్ ఇదే. మరో వైపు దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలకు ఎంపికైన 71 వేల మందికి ప్రధాని మోడీ నియామక పత్రాలు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమానికి రోజ్ గార్ మేళా అని పేరు పెట్టి ఘనంగా ప్రచారం చేసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉద్యోగ నియామకపత్రాలను పంపిణీ చేసిన మోడీ.. ఇటువంటి మేళాల ద్వారా యువతకు సాధికారత లభిస్తుందన్నారు. రోజ్ గార్ మేళా ద్వారా స్టెనోగ్రాఫర్, జూనియర్ అకౌంటెంట్, ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్, టీచర్, నర్సు, డాక్టర్, సోషల్ సెక్యూరిటీ ఆఫీసర్, పర్సనల్ అసిస్టెంట్, మల్టీ టాస్క్ స్టాఫ్ లకు మోడీ నియామక పత్రాలు అందజేశారు. ఏడున్నర దశాబ్దాలలో గతంలో ఎవరికీ ఉద్యోగాలు రాలేదా? నియామక పత్రాలు అందుకోలేదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమయ్యే విధంగా మోడీ చేసిన ఈ హంగామా రాజకీయ వర్గాలలో తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఎన్నికల ప్రయోజనాలు లక్ష్యంగా ఇటీవలి కాలంలో ప్రధాని మోడీలో ప్రచార యావ విపరీతంగా పెరిగిపోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీజేపీ సర్కార్ కేంద్రంలో అధికారం చేపట్టడానికి పూర్వం కూడా కోట్లాది మంది తమ అర్హతలను ప్రూవ్ చేసుకుని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. అయినా అప్పటి ప్రభుత్వాలేవీ ఇలా అర్భాటంగా ప్రచార పర్వానికి తెరతీసిన దాఖలాలు లేవు. ఎన్నికలు గతంలోనూ జరిగాయి. కానీ అధికారంలో ఉన్న ఏ పార్టీ కూడా ఇప్పటి మోడీ సర్కార్ లాగా ఒక పద్ధతి ప్రకారం..జరిగే నియామకాలను రాజకీయ ప్రయోజనం కోసం ఉపయోగించుకున్న దాఖలాలు వేవు. ఉద్యోగ నియామకాల ప్రక్రియను పర్యవేక్షించే వ్యవస్థలు ఉన్నాయి. వాటి ద్వారానే ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్లు వెలువడతాయి. ఆయా వ్యవస్థల ఆధ్వర్యంలోనే రాత పరీక్షలు జరుగుతాయి. అందులో క్వాలిఫై అయిన వారికి ఇంటర్వ్యూలకు కాల్ లెటర్స్ వస్తాయి. ఇంటర్వ్యూలో కూడా అర్హత సాధించిన వారికి ఉద్యోగాలు లభిస్తాయి. ఇదీ నియామక ప్రక్రియ. ఆ విధంగా తమను తాము ప్రూవ్ చేసుకుని, రాత పరీక్షలో, ఇంటర్వ్యూలో నెగ్గి ఉద్యోగాలకు అర్హత సాధించిన వారికి నియామకపత్రాల పంపిణీ అంటూ మోడీ ఆర్భాటం చేయడమేమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి. ఈ ఏడాది తొమ్మిది రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి..వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలలో ప్రధాని మోడీ పార్టీ లక్ష్యమేమిటో ప్రకటించేశారు.

# ఒంటరి పోరుకు కమలం సిద్ధం



విజయవాడ, జనవరి 21, ఢిల్లీలో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు ముగిశాయి. ఏపీ బీజేపీ తరపున సోము వీర్రాజు ప్రజెంటేషన్ ఇచ్చారు. అన్ని రాష్ట్రాల్లో పార్టీ ఎలా బలపడాలో చర్చలు జరిపారు. అయితే ఏపీ గురించి పెద్దగా చర్చ జరగలేదు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ గురించి ప్రధాని మోదీ గొప్పగా చెప్పారు. కానీ సోము వీర్రాజు ప్రస్తావన చేయలేదు. ఏపీలో గెలుస్తామని..బలపడతామని కూడా చెప్పలేదు. అసలు పార్టీ స్ట్రాటజీ గురించి ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదు. దీంతో ఏపీ గురించి అసలు కేంద్ర నాయకత్వం దృష్టి పెట్టలేదని .. జనసేనతో పొత్తులు కొనసాగించే ఆసక్తి కూడా చూపించడం లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఏపీలో పొత్తుల వల్ల ఎక్కువగా నష్టపోయామన్న భావన బీజేపీ నేతల్లో ఉంది. జనసేనతో పొత్తు పెట్టుకున్నా.. బీజేపీ మైనర్ భాగస్వామిగా ఉండాల్సి వస్తుంది. జాతీయ పార్టీగా ఇది ఆ పార్టీకి ఇబ్బందికరమే. అందుకే జనసేనతో పొత్తు విషయంలోనూ ఒత్తిడి చేయకూడదని.. భావిస్తున్నట్లుగా జాతీయ కార్యవర్గ సమావేశంలో సందేశం ఇచ్చినట్లుగా తెలుస్తోంది. గతంలో పలుమార్లు టీడీపీతో పొత్తు పెట్టుకోవడం వలనే పార్టీ ఏపీలో ఎదగలేదనే అభిప్రాయంతో జాతీయ నాయకత్వం ఉంది. గత అనుభవాలను దృష్టి లో ఉంచుకొని జనసేనతో కలిసి పార్టీని పటిష్టం చేసుకోవాలని జాతీయ నాయకత్వం పలుమార్లు ఆలోచన చేసింది. అయితే ఇక్కడి పరిస్థితులను బట్టి టీడీపీతో పొత్తుకే పవన్ కళ్యాణ్ మొగ్గు చూపుతున్నట్లు రాష్ట్ర నేతలు జాతీయ నాయకత్వం అంచనాకు వచ్చింది. అందుకే జనసేనతోనూ పొత్తుల కోసం ఒత్తిడి చేయకూడదని భావిస్తున్నారు. రాష్ట్రంలోని రాజ కీయ పరిణామాలు, బీజేపీ నిర్వహిస్తున్న పాత్ర తదితర అంశాలను ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లారు. గతం నుంచే జనసేన మిత్రపక్షంగా ఉన్నప్పటికీ పెద్దగా కలిసి కార్యక్రమాలు నిర్వహించింది లేదు. రాను రాను రెండు పార్టీల మధ్య దూరం పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర పర్య టన తర్వాత పరిస్థితి మారుతుందని అందరూ భావించారు. రెండు పార్టీల మధ్య దూరం తగ్గి ఉమ్మడి కార్యక్రమాలు చేపట్టొచ్చని భావిస్తున్న తరుణంలో..రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారాయి. అధికార పార్టీని గట్టిగా నిలువ రించాలనే కృతనిశ్చయంతో తెదేపా వైపే పవన్ మొగ్గు చూపుతున్నట్లు ఇప్పటం, రణస్థలం తదితర సమావేశాల్లో ఆయన చేస్తున్న ప్రకట నలను బట్టి స్పష్టమవుతోంది. బీజేపీ కూడా కలిసొస్తే బాగుం టుందనే అభిప్రాయం అటు జనసేన, ఇటు తేదేపా నేతల్లో ఉన్నప్పటికీ..జాతీయ నాయకత్వం మాత్రం అలాంటి ఆలోచనలు వద్దన్నట్లుగా ఉందని చెబుతున్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో భీమవరంలో నిర్వహించనున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో అధిష్టానం నిర్ణయం పై రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి వీ.మురళీ ధరన్ మరింత స్పష్టత ఇవ్వనున్నారు. పొత్తులను పక్కనబెట్టి సొంత ఎదు గుదలపై దృష్టిసారించాలంటూ అధిష్టానం నుంచి స్పష్టత వచ్చినందున రెండు కుటుంబ పార్టీలకు దూ రమంటూ సోము వీర్రాజు ప్రకటించనట్లుగా తెలుస్తోంది. ఈ నెల 23, 24 తేదీల్లో భీమవరంలో నిర్వహించే రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో ఏపీ బీజేపీ పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిసింది. జాతీయ నాయకత్వం ఆలోచనను సైతం రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి స్పష్టం చేయనున్నారు. అదే సమావేశాల్లో భవిష్యత్ కార్యాచరణ కూడా ప్రకటించనున్నారు.

# చిరు మా వాడే....

### రాజకీయాలకు దూరం అంటున్న మెగస్టార్

విజయవాడ, జనవరి 21రాజకీయాలు వదిలేసి పూర్తిగా సినిమాలకు టైమ్ కేటాయించిన తర్వాత చిరంజీవి మళ్లీ అందరివాడుగా మారిపోయారు. కానీ పనిగట్టుకుని ఆయన్ను వైసీపీ నేతలు టార్గెట్ చేస్తున్నారు. దానికి కారణాలు కూడా లేకపోలేదు. ఆ మధ్య తమ్ముడు ఉన్నత స్థాయికి రావాలని, రాజకీయాల్లో రాణించాలంటూ చిరంజీవి చేసిన వ్యాఖ్యలకు వైసీపీ నేతలు ఘాటుగానే బదులిచ్చారు. ఆ తర్వాత వాల్తేరు వీరయ్య సినిమా నాటికి చిరంజీవిలో మరింత పరిణతి వచ్చింది. తాను ఏ పార్టీకి చెందినవాడిని కాదని, తనకు వైసీపీ అయినా, జనసేన అయినా ఒకటేనని, ఎవరి తరపునా తాను ప్రచారం చేసేది లేదన తేల్చి చెప్పారు. దీంతో చిరు రాజకీయాలపై జనాలకు బాగానే క్లారిటీ వచ్చింది. మరి కాంగ్రెస్ మాత్రం ఆయన్ను ఇంతా తమవాడిగానే చెప్పుకోవడం విశేషం. చిరంజీవి కాంగ్రెస్ లోనే ఉన్నారని, ఆయనతో సోనియాగాంధీ, రాహుల్ గాంధీకి మంచి సంబంధాలే ఉన్నాయని చెప్పారు ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు. ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి ఏంటో అందరికీ తెలుసు. అలాంటి కాంగ్రెస్ అధ్యక్షుడు ఏం మాట్లాడారు, ఎందుకు మాట్లాడారు అనే లాజిక్ ఎవరికీ అవసరం లేదు. అయితే ఆయన మాట్లాడింది మెగాస్టార్ గురించి కాబట్టి, అందులోనూ చిరంజీవి రాజకీయాలు ఇప్పుడు టాక్ ఆఫ్ ఏపీగా ఉన్నాయి కాబట్టి రుద్రరాజు వ్యాఖ్యలపై అందరికీ ఆసక్తి మొదలైంది. అసలు చిరంజీవి నిజంగానే కాంగ్రెస్ నుంచి బయటకొచ్చేశారా..? ఒకవేళ జోడో యాత్రతో కాంగ్రెస్ సుడి తిరిగి కేంద్రంలో హస్తం పార్టీ హవా మొదలైతే మళ్లీ చిరంజీవి ఏదైనా నామినేటెడ్ పోస్ట్ తో తెరపైకి వస్తారా అనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఆ మధ్య గాడ్ ఫాదర్ సినిమాకు సంబంధించి చిరంజీవి ఆ సినిమాలోని ఓ డైలాగ్ ని ట్విటర్లో షేర్ చేశారు. రాజకీయం తన నుంచి దూరం కాలేదనని చిరంజీవి చెప్పే డైలాగ్ ని సినిమా ప్రమోషన్ కోసం వాడుకోవాలనుకున్నారు. కానీ అది పొలిటికల్ డిస్కషన్ గా మారింది. ఆ తర్వాత అది సినిమాలో డైలాగ్ మాత్రమేనని తేలడంతో అందరూ దాన్ని పట్టించుకోవడం ఆపేశారు. కానీ కాంగ్రెస్ కాస్త హడావిడి చేసింది. ఆ డైలాగ్ వచ్చిన కొన్నిరోజుల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఐడీకార్డ్ బయటకు వచ్చింది. చిరంజీవిని కాంగ్రెస్ డెలిగేట్ గా పేర్కొంటూ ఇచ్చిన ఐడీగార్ట్ అది. దాని కాలపరిమితి 2027 వరకు ఉంది. అంటే చిరంజీవి ఇంకా కాంగ్రెస్ లోనే ఉన్నారా అనే అనుమానం మళ్లీ మొదలైంది. చిరంజీవికి రాజకీయాలు అవసరం లేదు, ఆయనకు ఆసక్తి కూడా లేదనే విషయం తేలిపోయింది. ఒకసారి రాజకీయాల్లోకి వచ్చాక ఎన్నో చేదు అనుభవాలు ఆయన రుచి చూశారు. కేంద్ర మంత్రి అయ్యారన్న మాటే కానీ, ఆయన అంతకంటే ఎక్కువ విమర్శలే ఎదుర్కొన్నారు. విచిత్రం ఏంటంటే.. ఇప్పటికీ ఆయనపై విమర్శలు ఆగలేదు. ఏపీ మంత్రి రోజావంటివారు ఇప్పటికీ చిరంజీవిని టార్గెట్ చేస్తూ వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. వాటన్నిటినీ మౌనంగానే భరిస్తున్న చిరంజీవి పూర్తిగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఈ దశలో కాంగ్రెస్ ఏపీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు చేసిన కామెంట్లు కాస్త హాట్ టాపిక్ గా మారాయి. దీనిపై చిరంజీవి తరపున ఎవరైనా వివరణ ఇస్తారా, లేక రుద్రరాజు స్టేట్ మెంట్లకు కూడా వివరణ ఏంటని సైలెంట్ గా ఉంటారా.. వేచి చూడాలి.

# శంబర పోలమాంబ జాతరకు ఏర్పాట్లు

విజయనగరం, జనవరి 21, ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజనుల ఆరాధ్య దైవం శంబర పోలమాంబ జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో విజయనగరం పైడితల్లి అమ్మవారి పండగ తర్వాత పెద్ద సిరిమానోత్సవం శంబర పోలమాంబదే. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం శంబర గ్రామంలో ఈ ఆలయం ఉంది. ఈ నెల 23న తొలేళ్లు, 24న సిరిమానోత్సవం, 25న అంపకోత్సవం జరగనుంది. కరోనా నేపథ్యంలో గత మూడేళ్లు ఆంక్షల నేపథ్యంలో భక్తుల సంఖ్య తగ్గింది. ఈసారి ఎలాంటి ఇబ్బందులూ లేకపోవడంతో లక్షల్లో తరలివచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్లు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకేసారి రెండు లక్షల మంది వచ్చినా.. వారికి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ ఈవో వి.రాధాకృష్ణ తెలిపారు. ఉచిత దర్శనంతో పాటు రూ.10, రూ.50 దర్శనం టికెట్లు అందుబాటులో ఉంటాయి. వీటిని ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. పులిహోర ప్రసాదం ధర రూ.10, లడ్డూ రూ.15 గా నిర్ణయించారు. విశ్రాంతి భవనాలు, కేశ ఖండన శాల, చెప్పుల స్టాండ్, శాశ్వత క్యూలైన్లు లేకపోవడం కొంత ఇబ్బందే. వీటి గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు అంటున్నారు. ఉత్సవంలో కీలక ఘట్టమైన సిరిమానోత్సవం ఈ నెల 24న జరగనుంది. లక్షల్లో భక్తులొస్తారని అంచనా.. ప్రస్తుతం సిరిమాను తిరిగేందుకు వీలుగా ఆ మార్గాన్ని బాగు చేస్తున్నారు. గుంతలను పూడ్చుతున్నారు. గొల్లవీధి నుంచి పెద్దవలస వెళ్లే మార్గంలో 90 మీటర్ల సీసీ రోడ్డు పనులు సాగుతున్నాయి. సిరిమాను గుర్తింపు, తయారీ, ఊరేగింపునకు గతంలో వీధుల వారీగా బృందాలు ఉండేవి. ఆలయ అధికారులు, ట్రస్టుబోర్డు సభ్యులు పర్యవేక్షించేవారు. ఈ క్రమంలో కొన్నిచోట్ల సమస్యలు ఎదురయ్యేవి. ఈసారి అలా జరగకుండా ధర్మకర్తల పర్యవేక్షణలో ఒకరికే బాధ్యతలు అప్పగించేలా ప్రణాళికలు వేస్తున్నారు. వనంగుడి, చదురుగుడి ఆలయాల వద్ద ఎండ నుంచి ఉపశమనం పొందేలా చలువ పందిళ్లు, టెంట్లు ఏర్పాటు చేశారు. చిన్నారులకు పాలు, సాధారణ భక్తులకు మంచినీరు అందుబాటులో ఉంచుతున్నారు. గర్భిణులు, వృద్ధులకు ప్రత్యేక దర్శనాలు కల్పిస్తున్నారు. రద్దీ నేపథ్యంలో వీరు మొదటి వారంలో రాకుండా ఉంటే మంచిదని ఆలయ అధికారులు కోరుతున్నారు. భక్తులకు సేవలు అందించేందుకు వివిధ ఆలయాల నుంచి డిప్యుటేషన్‌పై 95 మంది సిబ్బందిని నియమించారు. పలు స్వచ్ఛంద సంస్థలూ పాల్గొననున్నాయి. శంబర జాతర నేపథ్యంలో పోలమాంబ అమ్మవారి ఘటాల ఊరేగింపు వేడుకగా జరిగింది. చదురు గుడిలో ఉంచిన ఘటాలకు గురువారం వేకువజాము నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. అనంతరం గ్రామ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవునా భక్తులు మొక్కులు చెల్లించారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పరిశీలించారు. శంబర గ్రామానికి చేరుకుని వనంగుడి, చదురు గుడి ఆలయ ప్రాంగణాలను తనిఖీ చేశారు. కూలైన్లు, ప్రసాదం కౌంటర్లు, సిరిమాను ఉంచే ప్రదేశాలను చూశారు.

# మల్లన్న సన్నిధిలో మరో వివాదం

శ్రీశైలం శ్రీశైలం మల్లన్న ఆలయం లో మరో వివాదం చోటుచేసుకుంది..స్వామి వారి గర్భాలయ అభిషేకాల ను టికెట్లు లేకుండా చేయిస్తామని, దేవస్థానానికి చెల్లించాల్సిన టికెట్ల ధర తమ కు అందిస్తే చాలని స్పష్టం చేస్తున్న దర్మకర్తల మండలి సభ్యురాలి ఆడియో లీక్ ఇప్పుడు శ్రీశైలంలో కలకలం రేపింది. ధర్మాన్ని పాటించాల్సిన ధర్మకర్తల మండలి సభ్యులే, అక్రమ ఆదాయానికి, అధర్మానికి తెరలేపి శ్రీశైల మల్లన్న ఆదాయానికి గండికొడుతున్న వైనం పై పెద్ద ఎత్తున విమర్శలు చెలరేగుతున్నాయి. మల్లికార్జునస్వామికి టికెట్ల రూపంలో వచ్చే ఆదాయాన్ని ధర్మకర్తల మండలి లోని కొందరు సభ్యులు గండి కొడుతూ అధర్మానికి పాల్పడుతున్నారని భక్తులు అసహనానికి గురవుతున్నారు...మల్లన్నకు రావాలసిన ఆదాయాన్ని అడ్డదారిలో అప్పనంగా అరగిస్తున్న అక్రమార్కుల పై చర్యలు తీసుకోవాలని ధార్మిక సంస్థలు మండి పడుతున్నాయి. శ్రీశైలంలో స్వామివారి గర్భాలయం లో అభిషేకం నిర్వహించుకోవాలంటే 5 వేల రూపాయల టికెట్ ధర ను నిర్ణయించింది దేవస్థానం...అయితే ఓ ధర్మకర్తల సభ్యురాలు టికెట్లు లేకుండానే స్వామివారి గర్భాలయ అభిషేకాలు చేయిస్తానంటు, భక్తులు ఎవరైన ఉంటే టికెట్ లేకుండా చేయిస్తాను అంటూ ఆ డబ్బులు తనే సంపాదించవచ్చు అంటు ఓ మద్య దళారీలు చెబుతున్న ఆడియో ఇప్పుడు శ్రీశైలంలో పెద్ద దుమారమే రేపుతోందిధర్మకర్తల చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి స్వామివారి లడ్డుప్రసాదాల తయారి ముడిసరుకుల కొనుగోలులో భారీ అక్రమాలు జరిగాయని,వాటి పై అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని, తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని స్వయంగా మీడియాకు వెల్లడించారు.. అదే పాలకమండలి లోని కొందరు సభ్యులు చైర్మన్ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

# ఫిబ్రవరి చివరి వారంలో బడ్జెట్ సమావేశాలు

విజయవాడ, జనవరి 21, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి చివరి వారంలో జరపాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సారి 20 రోజుల పాటు బడ్జెట్ సెషన్ నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. మార్చిలో అంతర్జాతీయ సదస్సులు జరపాలని ప్రభుత్వం భావిస్తోంది. పెట్టుబడుల సదస్సు, జీ 20 సన్నాహక సదస్సు కూడా మార్చిలోనే జరగాల్సి ఉంది. ఈ కారణంగా ఫిబ్రవరిలోనే అసెంబ్లీని సమావేశపరిస్తే ఎలా ఉంటుందా అన్నదానిపైనా పరిశీలన జరుపుతున్నారు. మార్చి 3, 4 తేదీల్లో విశాఖ వేదికగా ప్రతిష్టాత్మకంగా గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్ జరగబోతోంది.. ఆ తర్వాత మార్చి 28, 29 తేదీల్లో జీ–20 వర్కింగ్ గ్రూప్ సదస్సు నిర్వహించనున్నారు. వీటికంటే ముందుగానే అసెంబ్లీ బడ్జెట్ సెషన్ 2023–24ను నిర్వహించేందుకు సిద్ధం అవుతున్నారని అంటున్నరా.? ఇప్పటికే 2023–24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ రూపకల్పనపై కసరత్తు ప్రారంభించింది ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ. 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ 2,56,256 కోట్తో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టింది ఏపీ ప్రభుత్వం. 2023–24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ 2.65 లక్షల కోట్ల నుంచి2.75 లక్షల కోట్ల రూపాయల మధ్య ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఆయా శాఖలకు ఈ ఏడాది బడ్జెట్ ఏ మేరకు అవసరం అవుతుందనే అంచనాలు వేసుకోవాల్సిందిగా ఆర్థిక శాఖ అధికారులు సూచించారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని శాఖలకు సంబంధించిన ఉన్నత అధికారులు అంచనాలు రూపొందించుకోవాలని సూచిస్తున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలతో పాటు.. అవసరమైన మేరకే.. నిధులను కోరాల్సిందిగా సూచిస్తున్నారు. గత ఏడాది తరహాలోనే సంక్షేమానికి పెద్ద పీట వేయాలని ప్రభుత్వం స్పష్టంగా భావిస్తుంది. అంతే కాదు వచ్చేది అంతా ఎన్నికల సమయమే కాబట్టి.. సంక్షేమానికి ఒకింత ఎక్కువే ఇవ్వాలి కాని, లోటు ఉండొద్దని ఇప్పటికే ఆర్థిక శాఖ అధికారులకు ప్రభుత్వ పెద్దలు సూచించారు. ఇక అభివృద్ధి విషయంలోనూ ఈసారి ఎక్కువగా ఫోకస్ పెట్టక తప్పని సరి పరిస్థితి ఏర్పడింది. అత్యంత ప్రాదాన్యత కలిగిన రోడ్ల విషయంలో ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో రోడ్లకు భారీగానే నిధుల కేటాయింపు జరపాల్సి ఉంటుంది. అలాగే గృహ నిర్మాణంలోనూ ఇటీవల కాలంలో ప్రభుత్వం పై విమర్శలు వచ్చాయి. ఇళ్ల నిర్మాణం విషయంలో కూడ టార్గెట్‌ను రీచ్ కాలేకపోతుందని.. కేవలం పది శాతం ఇళ్లను మాత్రమే కట్టారని ప్రతిపక్షాలు ఆరోపణలతో హల్ చల్ చేస్తున్నాయి. దీంతో త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన నిధులను కేటాయించకుంటే.. ఎన్నికల నాటికి ఇళ్ల నిర్మాణం హామీని అమలు చేయలేకపోయామనే విమర్శలు ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టే ప్రమాదం లేకపోలేదు. గృహ నిర్మాణ శాఖకు భారీగానే నిధులు కేటాయించాల్సి ఉంది. ఇదే తరహాలో ఇరిగేషన్‌కు కూడా నిధుల ఎక్కువే కావాల్సి ఉంటుంది. ఒ వైపు సంక్షేమానికి.. మరోవైపు అభివృద్ధికి అదిక నిధుల కేటాయింపులే చేయాల్సిందేనన్న విషయం స్పష్టం అవుతుంది. ఆదాయార్జన శాఖలపై ప్రధానంగా ఫోకస్ పెట్టాల్సి ఉంటుందని అదికార వర్గాలు అంటున్నాయి. ఈ క్రమంలో ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖ, మైనింగ్, రెవెన్యూ వంటి వాటి నుంచి మరింత ఆదాయాన్ని సమకూర్చుకునే దిశగా ప్రణాళికలను తప్పని సరిగా రెడీ చేసుకోవాలి. అంతే కాదు రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగానే కేంద్ర పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వాలని ఆర్థిక శాఖ అధికారులు భావిస్తున్నారు. రా విద్య, వైద్యం వంటి రంగాలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతాంశాలుగా తీసుకుంటున్నందున ఈ రంగాలకు సంబంధించి కేంద్రం నుంచి ఎంత మేరకు నిధులను రాబట్టగలమనే అంచనాలను కూడా సిద్ధం చేస్తున్నారు ఆయా శాఖలకు చెందిన అధికారులు.

# తిరుపతిలో దిగ్విజయంగా గడప గడపకు మన ప్రభుత్వం 100 వ రోజు

### సహకరించిన తిరుపతి ప్రజలకు, వైఎస్సార్ సీపీ శ్రేణులకు కృతజ్ఞతలు ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి

తిరుపతి ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వందవ రోజుకు చేరుకోవడంతో.. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉదయం అట్టహాసంగా తిరుపతిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఊట గుంట, హమీద్ నగర్, శాలివాహన నగర్, ఎల్ఐసి రోడ్ ప్రాంతాల్లో.. తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, భూమన అభినయ్, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు తో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారుగడప గడపకు పర్యటించిన జగనన్న సంక్షేమ పథకాల లక్ష్యాలను వివరించిన తర్వాత ఊటగుంట వద్ద 100 కిలోల బారీ కేక్ ను భూమన కట్ చేసి... శిరీష, ముద్ర నారాయణ, అభినయ్ తో పాటు వైఎస్సార్ సీపీ శ్రేణులకు తినిపించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి భూమన కరుణాకర రెడ్డి మట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తిరుపతి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు జగనన్న పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నాయకుడు గడపగడపకు కార్యక్రమం హలో భాగస్వామి ప్రజలతో మమేకమవుతున్నారు తిరుపతిలో మీ అందరి అభిమానం సహకారాలతో ఈ కార్యక్రమం మరీ అంత విజయవంతంగా వందవ రోజుకి చేరుకుంది మున్ముందు కూడా కొనసాగుతు గత ఎన్నికల్లో తనకు 85 వేల మంది మాత్రమే ఓట్లు వేసి ప్రస్తుతం 87 శాతం ఇళ్ళకు... 2.12 లక్షల మందికి తిరుపతిలో జగనన్న సంక్షేమ పథకాల వల్ల లభించే కోరుతోంది. ప్రతి ఇంటికి సగటున లక్షన్నర రూపాయలకు తగ్గకుండా లబ్ధి అందుతోంది కులాలు, మతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా.. పేదవారే ప్రాతిపదికగా ఓటు వేయని వారికి, తెలుగుదేశం పార్టీ వారికి కూడా కలిపి కోటి 18 లక్షల మందికి రాష్ట్రవ్యాప్తంగా జగనన్న లబ్ధి చేకూరుస్తున్నారు. జగనన్న నేరుగా బటన్ నొక్కి తన అక్క చెల్లెమ్మలకు చేసిన సహాయం లక్ష 87 వేల కోట్ల రూపాయలు అయితే మిగతా పథకాల ద్వారా మూడు కోట్ల 14 లక్షల రూపాయలు మేరకు సహాయం అందించారు

## ఫిబ్రవరి 10 న వైకాపా మేగా జాబ్ మేళ

మదనపల్లె పట్టణంలోని బీటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10వ తేదీన వైఎస్సార్‌సీపీ మెగాజాబేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నవాజ్ బాషా తెలిపారు. నేడు మదనపల్లె మున్సిపల్ కార్యాలయంలో మెగా జాబేళా ఏర్పాట్లకు సంబంధించి నియోజకవర్గ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండిసి ఛైర్మన్ షమీంఅస్లాం, జడ్పీటీసీ ఉదయ్ కుమార్, మున్సిపల్ ఛైర్ పర్సన్ వరపన మనూజ, ఎంపిపి రెడ్డమ్మ, వైస్ చైర్మన్లు జింకా వెంకటాచలపతి, నూర్‌అజామ్, కమిషనర్, కౌన్సిలర్లు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్జీవో సంఘం, వర్సెస్ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య

విజయవాడ, జనవరి 20,ఏపీ ప్రభుత్వం ఉద్యోగుల మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గవర్నర్ ను కలిసి ప్రభుత్వంపై ఫిర్యాదు చేయడంతో ఏపీ ఎన్జీవో సంఘం, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య నేతలు విమర్శలు చేస్తున్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణపై విమర్శలు చేస్తున్నారు ఇతర సంఘాల నేతలు. తాజాగా ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ... 2018 నుంచి డీఏ, ఇతర బకాయిలను ప్రభుత్వం చెల్లించలేదన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నందుకు ఉద్యోగ సంఘాల నేతలుగా సిగ్గు పడుతున్నామన్నారు. వేతనాల కన్నా ముందు పెన్షన్ ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ప్రభుత్వం మర్యాద నిలబెట్టుకోవాలన్నారు. ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి దగ్గరవుతుందన్న వార్తలను స్పందించిన బండి శ్రీనివాసరావు... ఉద్యోగుల ప్రయోజనాల కోసమే పోరాడుతున్నామన్నారు. ప్రభుత్వానికి ఎన్జీవో సంఘం దగ్గరవ్వడంలేదన్నారు. ఉద్యోగుల సమస్యలను గవర్నర్ దగ్గర చెప్పుకోవాలి కానీ, ఇతర సంఘాల గురించి ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందో చెప్పాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణను ఉద్దేశించి బండి శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఏపీ ఎన్జీవో సంఘం చాలా ఏళ్ల క్రితం ఏర్పడిందని గుర్తుచేశారు. ఏపీజీఈఏకు ఎలా అనుమతి వచ్చిందో అందరికీ తెలుసన్నారు. ఏపీ ఎన్జీవో సంఘం సాధించిన కారుణ్య నియామకాల ఉత్తర్వుల వల్లే సూర్యనారాయణకు ఉద్యోగం వచ్చిందని స్పష్టం చేశారు. సూర్యనారాయణ అధ్యక్షత వహిస్తున్న ఉద్యోగుల సంఘం గుర్తింపు రద్దు చేయాలని సీఎస్‌ను కోరతామని బండి శ్రీనివాసరావు అన్నారు. ఏపీ ఎన్జీవో కార్యవర్గంతో పాటు జేఏసీ సమావేశాల్లో చర్చించి తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సూర్యనారాయణ తీరుపై ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు ఫైర్ అయ్యారు. సూర్యనారాయణ ఉద్యోగ సంఘాలను విమర్శించడం మానుకోవాలన్నారు. ఆయన ఉద్యోగుల గురించి మాట్లాడితే బాగుంటుందన్నారు. సూర్యనారాయణ ఛాంపియన్‌లా, ఇతర ఉద్యోగ సంఘాల నేతల్ని చవటల్లా చిత్రీకరిస్తే ఊరుకోమన్నారు. 11 పీఆర్సీలు సాధించిన ఘనత ఏపీ ఎన్జీవో సంఘానికి ఉందన్నారు. గవర్నర్‌ను కలిసి ఉద్యోగుల సమస్యలపై మాట్లాడకుండా తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సూర్యనారాయణ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రభుత్వ ఉద్యోగులను తాకట్టు పెట్టుతున్నారని ఆరోపించారు. సీఎం జగన్ చర్చలకు పిలిస్తే, సూర్యనారాయణ ఎందుకు శ్రీకాకుళం పారిపోయారని బండి శ్రీనివాసరావు ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు గవర్నర్ కలవడం పబ్లిసిటీ స్టంట్ అని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి విమర్శించారు. ఉద్యోగుల సమస్యలపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించినట్టు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై సీఎం వైఎస్ జగన్‌తో చర్చించిన తర్వాత గవర్నర్‌ను కలవడం ఏంటని వెంకట్రామిరెడ్డి ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలోనే వీఆర్ఏలు, ఎండీవోలకు పదోన్నతులు వచ్చాయని గుర్తుచేశారు. సచివాలయ ఉద్యోగులకు ప్రొహిబిషన్ డిక్లేర్ చేశారన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగుల సమస్యలపై ఎందుకు మాట్లాడలేదని ప్రభుత్వ ఉద్యోగ సంఘంపై విమర్శలు చేశారు. ఏపీ ఎన్జీవో నేత బండి శ్రీనివాసరావు చేసిన విమర్శలపై ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేత సూర్యనారాయణ కౌంటర్ ఇచ్చారు. ఉద్యోగుల సర్వీసులను నియంత్రించే అధికారం గవర్నర్‌కే ఉంటుందని, అందుకే ఆయనను కలిశామన్నారు.

గవర్నర్ వద్ద వేరే సంఘం

పేరు కానీ, ఇతర సంఘం నేతల ప్రస్తావన కానీ తీసుకురాలేదన్నారు. ఉద్యోగుల వేతనాలు ఒకటో తేదీనే చెల్లించాలని చట్టం ఉందని చెప్పిన ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు దానిని నిరూపించాలని డిమాండ్ చేశారు. చట్టంలో అలా ఉంటే తాము క్షమాపణ కోరతామని సూర్యనారాయణ తెలిపారు. ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని జీవోలు ఉన్నాయి కానీ, చట్టం లేదని స్పష్టం చేశారు. ఉద్యోగుల సంఘం రేపట్నుంచి సమ్మె చేయడానికి సిద్ధంగా లేదని, కార్యాచరణ ప్రకారం ముందుకెళ్తామన్నారు. తమ సంఘం గుర్తింపును రద్దు చేయమని ఫిర్యాదు చేసే హక్కు వాళ్లకు ఉంటుందని, జీతాల కోసం చట్టం చేయమంటే సంఘం గుర్తింపు రద్దు చేయమంటారా? అని బెదిరింపులకు పాల్పడతారా అని ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం దొడ్డిదారిన గుర్తింపు తెచ్చుకోలేదని సూర్యనారాయణ స్పష్టం చేశారు.

## ఆనం పాలిటిక్స్ కు ఎండ్ కార్డేనా



నెల్లూరు, జనవరి 21, నెల్లూరు జిల్లా వెంకటగిరి వైసీపీ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి ఆ పార్టీలో పొలిటికల్ సీన్ పూర్తయిపోయింది. దీనికి రుజువే ఆ మెసేజ్. ఇటీవల కొత్తగా వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన వెంకట్రామయ్య ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డికి ఓ మెసేజ్ పంపించారు. గడపగడపకు కార్యక్రమంలో ఇప్పటి వరకు మీరు అందించిన సహకారం మరువలేనిది, అందుకు ధన్యవాదాలు అంటూ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి మున్సిపల్ కమిషనర్ వెంకట్రామయ్య మేసేజ్ పంపించారు. అంటే ఇకపై ఆనం రామనారాయణ రెడ్డి గడప గడప కార్యక్రమాలకు రాకూడదని అర్థమా, వచ్చినా అధికారులు ఆయనకు సహకరించబోరని అర్థమా.. ప్రస్తుతం నెల్లూరు రాజకీయాల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఆనం రామనారాయణ రెడ్డి విషయంలో ఎందుకో సీఎం జగన్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆయన వ్యాఖ్యలని చాలా సీరియస్ గా తీసుకున్నారు. ప్రభుత్వంపై ఆయన చేసిన విమర్శలకు జగన్ గట్టిగా బదులిచ్చారు. బహిరంగ వేదికలపై విమర్శలకు దిగిన ఆనంను ఇప్పటికే వైసీపీ పక్కనపెట్టింది. వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్ చార్జ్ పదవి నుంచి తొలగించి.. నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డిని నియమించింది అధిష్టానం. ఆ తర్వాత ఎమ్మెల్యే ఆనంకు గన్ మెన్ల సంఖ్యను కుదించారు. ఇప్పుడు మున్సిపల్ కమిషనర్ ఆనం రామనారాయణరెడ్డికి పంపిన మేసేజ్ తీవ్ర చర్చనీయాంశమైంది. ఆ మెసేజ్ తో పరోక్షంగా ఆనంకు వైసీపీతో పూర్తిగా సంబంధాలు తెగిపోయినట్టయింది. వెంకటగిరి నియోజకవర్గ ఇన్ చార్జ్ గా నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డిని నియమించిన తర్వాత కూడా వెంకటగిరిలో ఆనం గడప గడప కార్యక్రమాన్ని కొనసాగించారు. అధికారులతో సమీక్షలు, సమావేశాలు పెట్టారు. పనులు త్వరగా చేయాలని, ఎన్నికల్లోపు అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. ఈ వ్యవహారం అధిష్టానానికి నచ్చలేదు. దీంతో ఆయన గడప గడపకు వెళ్లకుండా అడ్డుకోవాలనుకుంది. మున్సిపల్ కమిషనర్ తో ఆ మెసేజ్ ఇప్పించింది. అయితే ఆ మెసేజ్ వైసీపీ నుంచి వచ్చిందా, లేక రామ్ కుమార్ రెడ్డి ఆదేశమా అనేది తేలాల్సి ఉంది. నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి వెంకటగిరి ఇన్ చార్జ్ గా వచ్చిన తర్వాత అధికారులను కూడా తనకు అనుగుణంగా మార్చుకుంటున్నారు. వెంకటగిరి మున్సిపాల్టీకి వెంకట్రామయ్యను నూతన కమిషనర్ గా తెచ్చుకున్నారు. ఆ తర్వాత క్రమంగా కౌన్సిలర్లలో కూడా చీలిక వచ్చింది. కొంతమంది కౌన్సిలర్లు రామ్ కుమార్ రెడ్డికి మద్దతుగా వచ్చారు. ఇకపై నియోజకవర్గ పరిధిలోని అధికారులు కూడా ఎమ్మెల్యేగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి మాట వినరనే అర్థం వచ్చేలా ఇప్పుడు కమిషనర్ పంపిన మేసేజ్ ఉందనే అనుమానాలు కలుగుతున్నాయి. గడప గడపకు కార్యక్రమం పార్టీ పరంగా జరగడం లేదని వైసీపీ అంటోంది. గతంలో గడప గడపకు వైసీపీ అనే పేరు పెట్టాలనుకున్నా ఆ తర్వాత గడప గడపకు మన ప్రభుత్వం అని ప్రకటించారు. అయితే ఇప్పుడు రామనారాయణ రెడ్డిని గడప గడపకు వద్దంటే ఆ కార్యక్రమం గడప గడపకు మన ప్రభుత్వం అవుతుందా, లేక గడప గడపకు వైసీపీ అవుతుందా అనేది తేలాల్సి ఉంది. వైసీపీకి, ఆనంకు మధ్య ఇప్పుడు గ్యాప్ పూర్తిగా పెరిగిపోయింది. వచ్చే ఎన్నికల్లో ఆనంకు వైసీపీ టికెట్ రాబోదని దాదాపుగా నిర్ధారణ అయింది. ఇప్పుడు వెంకటగిరి నియోజకవర్గాన్ని రామ్ కుమార్ రెడ్డి తన కనుసన్నల్లోకి తీసుకుంటున్నారు, ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. అంటే ఇకపై ఆనం వైసీపీలో ఉన్నా లేనట్టే. పొమ్మనకుండానే గట్టిగా పొగపెట్టేశారు. ఇక పార్టీకి కటీఫ్ చెప్పడం ఆనం వంతు.

## లోకేశ్ పాదయాత్రకు మద్దతుగా పోస్టర్ ఆవిష్కరణ

**కొయ్యలగూడెం వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు**

ఏలూరు,జనవరి21: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రకు మద్దతుగా కొయ్యలగూడెం మండలం కొయ్యలగూడెం టౌన్‌లో నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు యువగళం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముందుకు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించి.. లోకేష్ పాదయాత్ర దిగ్విజయంగా జరగాలని స్థానిక వినాయక ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ... రాష్ట్రంలో అసమర్థుడు జగన్ రెడ్డి పాలనలో యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేద మధ్యతరగతి ప్రజలు సుఖంగా జీవనం సాగించే పరిస్థితి లేదని తెలిపారు. వారి సమస్యల్ని పాదయాత్రలో తెలుసుకుని ప్రజలకు అండగా ఉండటానికి లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని చెప్పారు. ఈ పాదయాత్రతో జగన్ రెడ్డి అధికారం పోయి జైలుకు వెళ్తాడని, వైసీపీ పార్టీ భూస్థాపితం అవుతుందని అన్నారు. సైకో పాలన పోయి సైకిల్ పాలన వస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. పాదయాత్రకు అన్నివర్గాల ప్రజలు మద్దతు తెలుపు తున్నారని పోలవరం నియోజకవర్గం నుంచి కూడా అందరూ పాదయాత్రలో పాల్గొనాలని బొరగం శ్రీనివాసులు పిలుపునిచ్చారు.

## దళితులపై కక్షకట్టిన జగన్ ప్రభుత్వం

**సంక్షేమాన్ని విస్మరించిందన్న నక్కా**



అమరావతి,జనవరి21 : దళిత సంక్షేమానికి పెద్దపీట వేస్తానన్న జగన్, ముఖ్యమంత్రి అయ్యాక దళితులపై కత్తివేటు వేశారని మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు ఆగ్రమం వ్యక్తం చేశారు.దళితులు నిలదీస్తే నిర్బంధం, ప్రశ్నిస్తే బేడీలు, అడ్డుకుంటే అవమానాల పాలు చేస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం 4 లక్షల మంది దళితయువతకు ఉపాధి కల్పించిందని గుర్తుచేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... నాలుగేళ్లలో జగన్ రెడ్డి నలుగురికైనా ఉపాధి కల్పించారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో సబ్ ఎ÷-లానే అమల్లో లేకుంటే, సబ్ ఎ÷-లాన్ అమల్లో ఏపీ టాప్‌లో ఉందా అని నిలదీశారు. చంద్రబాబు దళితులకిచ్చిన 12 వేల ఎకరాలను ఇళ్లస్థలాల పేరుతో లాక్కున్నారన్నారు. దళిత రాజధాని అమరావతిని, అంబేద్కర్ స్మృతివనాన్ని నాశనం చేశారని ఆయన మండిపడ్డారు. విజయవాడలో అంబేద్కర్ విగ్రహం పెట్టడం కాదని, అంబేద్కర్ స్మృతివనం నిర్మాణాన్ని పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. 24తో గడువు ముగుస్తున్న సబ్ ఎ÷-లాన్ యాక్ట్‌ను పదేళ్లు పొడిగించాలన్నారు. సబ్‌ప్లాన్ అమలుకు ప్రత్యేక చట్టం చేసి, దళితనిధులు దారి మళ్లకుండా చూడాలన్నారు. నూటికి వెయ్యిశాతం జగన్ రెడ్డి దళితద్రోహి అని స్పష్టం చేశారు. దళిత మంత్రులు, వైసీపీ దళిత ఎమ్మెల్యేలు తమ జాతికి జరుగుతున్న అన్యాయంపై ఆత్మవిమర్శ చేసుకోవాలని నక్కా ఆనందబాబు హితవుపలికారు.

## ఒక్క రోజే 23 కోట్ల ఆదాయం



గుంటూరు, జనవరి 21, ఏపీఎస్ ఆర్టీసీ మునుపెన్నడూ లేని విధంగా రికార్డు స్థాయి ఆదాయాన్ని నమోదు చేసింది. ఈనెల 18న ఒక్క రోజులో రూ.23 కోట్ల ఆదాయాన్ని సాధించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అత్యధిక ఎర్నింగ్స్ సాధించిన రోజుగా రికార్డు నెలకొల్పింది. ప్రతి ఏటా సంక్రాంతి సీజన్ రికార్డు స్థాయి ఆదాయం నమోదవుతుంది. టిక్కెట్ల ధరలను పెంచకుండానే సంస్థకు ఆదాయం దక్కింది. సాధారణ ఛార్జీలతో ప్రత్యేక బస్సులు నడిపితే ప్రయాణీకులు ఆదరిస్తారనడానికి ఇదొక నిదర్శనమని అధికారులు అంటున్నారు. ఈ సంక్రాంతికి ప్రయాణికులు ప్రయాణ భారాన్ని తగ్గించుకునేందుకు ఏ.పి.ఎస్.ఆర్.టి.సి బస్సులనే ఎంచుకున్నారు. ఇతర ప్రైవేటు వాహనాలు, సొంత వాహనాల కంటే ఆర్టీసీకే మొగ్గు చూపారని అధికారులు చెబుతున్నారు. సంక్రాంతి సమయంలో కార్గో ద్వారా కూడా ఎక్కువ ఆదాయం నమోదైంది. ఒక్క రోజులో రూ.55 లక్షలు సాధించింది. గతంలో ఒక రోజు ఆదాయం రూ.45 లక్షలుగా రికార్డులో ఉంది. ఈసారి దాన్ని అధిగమించింది. ప్రయాణికులకు ముందస్తుగా బస్సులను అందుబాటులో ఉంచడం, నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, సమర్థవంతంగా నిర్వహించడం, ఎప్పటికప్పుడు బస్సులు పర్యవేక్షించడం,రద్దీకి తగ్గట్టు బస్సుల ఏర్పాటు వల్లనే రికార్డు స్థాయి ఆదాయం వచ్చిందన్నారు అధికారులు. సంస్థలోని సిబ్బంది ముఖ్యంగా డ్రైవర్లు, కండక్టర్ల అంకితభావం, వారి కృషి ఫలితంగానే ఈ సంక్రాంతి ప్రత్యేక సమయంలో ఈ ఘనత సాధించామని కితాబు ఇచ్చారు. పర్యవేక్షణలో అధికారుల సహాయసహకారాలనూ కూడా కొనియాడారు. కార్గో పట్ల, ప్రత్యేక సర్వీసుల పట్ల ప్రయాణికులు చూపించిన ఆదరణ మరువలేనిదంటున్నారు. సంక్రాంతికి ముందు రోజుల్లో జనవరి 6 నుంచి 14 వరకు ఏపీఎస్ ఆర్టీసీ రికార్డు స్థాయిలో 3,392 ప్రత్యేక బస్సులు నడిపింది. సాధారణ ఛార్జీలకే తగిన సంఖ్యలో ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉండటంతో ఏపీ, తెలంగాణ, తదితర ప్రాంతాల ప్రజలు ప్రైవేట్ బస్సుల కంటే, ఏపీఎస్ఆర్టీసీ బస్సులకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. తిరుగు ప్రయాణ టిక్కెట్ ఛార్జీపై 10శాతం రాయితీ సౌకర్యం కూడా ప్రయాణికులను ఏపీఎస్ వైపు ఆకర్షించేలా చేసిందని ఎండీ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. గత సంవత్సరం ఏపీఎస్ఆర్టీసీ సంక్రాంతి ముందు రోజుల్లో 2,400 ప్రత్యేక బస్సులను నడిపించిందని చెప్పారు. సంక్రాంతి ప్రత్యేక బస్సులకు సాధారణ ఛార్జీలు వసూలు చేయడం వల్ల ప్రయాణికులు ఇతర వాహనాలను ఆశ్రయించకుండా ఏ.పి.ఎస్.ఆర్.టి.సి. బస్సులకే ఎక్కువ మొగ్గు చూపారని అధికారులు చెబుతున్నారు. దీని ఫలితంగా ఏ.పి.ఎస్.ఆర్.టి.సి స్థూల ఆదాయం బాగా పెరిగిందని అంటున్నారు. గత సంవత్సరం సాధించిన ఆదాయం రూ . 7.17 కోట్లుతో పోలిస్తే, ఈ సంవత్సరం 50% అదనపు ఛార్జీలు లేకుండానే అదనంగా రూ. 7.90 కోట్ల ఆదాయాన్ని ఏ.పి.ఎస్.ఆర్.టి.సి ఆర్జించిందని తిరుమలరావు తెలిపారు. గత ఏడాది ఇవే రోజుల్లో సాధించిన రూ.107 కోట్ల ఆదాయం కంటే ఈ సంవత్సరం రూ. 141 కోట్ల ఆదాయం ఏపీఎస్ ఆర్టీసీ సాధించగలిగిందని ఏ.పి.ఎస్.ఆర్.టి.సి మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమల రావు వెల్లడించారు.

## జనసేనకు మహిళలే పెద్ద అండ



**పొత్తులపై పవన్ కళ్యాణ్‌దే తుది నిర్ణయం: నాగబాబు**

కర్నూలు,జనవరి21 :పొత్తులపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్దే తుది నిర్ణయమని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు నాగబాబు స్పష్టం చేశారు. శనివారం మౌర్య హోటల్లో జనసేన వీర మహిళల సమావేశంలో నాగబాబు పాల్గొని ప్రసంగించారు. పొత్తులు లేకుండా ఉంటే జిల్లాలో అన్ని నియోజక వర్గాల్లో జనసేన పోటీ చేస్తుందని తెలిపారు. పొత్తులు ఉంటే పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ముందుకు వెళతామని నాగబాబు పేర్కొన్నారు. మహిళలు అంతా జనసేన కార్యక్రమాల్లో పాల్గొని పార్టీని ముందుకు తీసుకుని వెళ్లాలన్నారు. జనసేనకు మహిళలు పెద్ద పెన్నిధి అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎవరితో పొత్తు అనేది త్వరలోనే చెబుతామని జనసేన పీఏసీ సభ్యులు నాగబాబు తెలిపారు. ఏపీలో పాలన చెత్తగా ఉందని.. నాలుగేళ్లుగా అరాచకం, రౌడీ రాజ్యం, గంజాయి రాష్ట్రంగా మారిపోయిందన్నారు. శ్రీకాకుళంలో జరిగిన యువశక్తి ప్రోగ్రాంతో రాష్ట్రంలో జనసేన నాయకులపై వైసీపీ కన్నేసి ఉంచారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఎలా ముందుకెళ్లాలి అనే దానిపై జనసైనికులతో చర్చిస్తున్నామన్నారు. పవన్ కళ్యాణ్‌పై పోటీకి సిద్ధం అన్న అలీ కామెంట్స్‌పై.. నో కామెంట్స్ అని నాగబాబు చెప్పారు.

## భక్తులతో కిటకిటలాడిన సంగమేశ్వర ఆలయం

కాకినాడ కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం ఉప్పలంక శివారు మొండి గ్రామంలో వేంచేసియున్న సంగమేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. చోల్లంగి అమావాస్య పురస్కరించుకుని జిల్లా నలుమూలల నుంచి తెల్లవారుజాము నుండి భక్తులు సముద్ర స్థానం ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే స్వామివారికి మొక్కులు తీర్చేందుకు వీరభద్ర స్వామి నీ ఊరేగించి, సముద్రంలో స్నానం చేసి , స్వామివారికి పూజలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ లైన్ లో బారులు తీరారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల భక్తులు స్వామివారిని దర్శించకుండానే వెనుతిరిగే పరిస్థితి ఏర్పడింది. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా వేలాది మంది భక్తులు తరలివచ్చారు .వారికి సౌకర్యాలు కల్పించడంలో అధికారులతో పాటు ఎం.ఎస్. ఎన్. చార్టీస్ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టతను డీవీకే శాస్త్రి తెలిపారు

## ఏసీబీ వలలో ఐటీడీయే అధికారులు

ఏటూరు నాగారం ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఐటీడీఏలో ఏసీబీ దాడులు జరిగాయి. ఐటీడీఏ లో ఏసీబీ దాడులు ఇంజనీరింగ్ శాఖలో పనిచేస్తున్న డిఈ నవీన్, ఏ ఈ ఆబిద్ ఖాన్. 50,000 లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుపడ్డారు. గత ఏడాది ములుగు కు చెందిన సంజీవ్ అనే వ్యక్తి మేడారంలో పెయింటింగ్ వర్క్ చేశాడు. దానికి సంభందించి 16 లక్షల 50 వేల రూపాయల బిల్లు పాస్ చేయించడానికి ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్ సంజీవ వద్ద 90,000 లంచం డిమాండ్ చేశారు. దీంతో పెయింటింగ్ కాంట్రాక్టర్ సంజీవ్ ముందుగా 50,000 ఇచ్చి పూర్తి బిల్లు పాస్ అయ్యాక 40 ఇచ్చే విధంగా ఒప్పందం చేసుకున్నారు. తరువాత ఈ విషయమై ఏసీబీ అధికారులను ఆశ్రయించి సంజీవ్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన ఎసిబి డిఎస్పి సుదర్శన్ రెడ్డి వారి సిబ్బందితో ఈనెల 10వ తారీఖు నుండి రెక్కి నిర్వహించారు. శుక్రవారం రాత్రి లంచం గా 50,000 డి ఈ నవీన్, ఏఈ ఆబిద్ ఖాన్ లకు ఇస్తుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.ఐటీడీఏలోని ఏఈ, డీఈ చాంబర్లను సోదాలు చేసి రికార్డులు, నగదు 50వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సోదాలలో ఏసిబి డిఎస్పి సుదర్శన్ రెడ్డి తో పాటు సిబ్బంది శ్యామ్, కృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాలతో హోటళ్ల చెలగాటం

**గుట్టుగా కుళ్లిన ఆహార పదార్థాల సరఫరా**

**హోటళ్లలో నిరంతర తనిఖీలు చేయాలంటున్న జనం**

విజయవాడ,జనవరి21(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో హోటళ్లకు వెళ్లడమే తగ్గింది. అయితే అప్పుడప్పుడూ ఆ అవకాశం తప్పడం లేదు. అయితే ఇదే అదనుగా హోటల్ నిర్వహకులు కుళ్లిన మాంసాన్ని పదార్థాలను ఫ్రిజ్‌లలో దాచి వండి వారుస్తున్నారు. ఇలాంటి కేసులు దాడుల్లో బటబయటు అయ్యాయి. కరోనా నేర్పిన పాఠాల కారణంగా శుచిగా, వేడిగా తినాలన్న తపనలో ఉన్న ప్రజలకు కొందరు హోటల్ యజమానులు ఇలా కుళ్లిన పదార్థాలను వేడిచేసి పంపిణీ చేస్తున్నారు. దొరికితేనే దొంగలుగా చిక్కుతున్నారు. గతంలో విజయవాడ,గుంటేరుతో పాటు వివిధ జిల్లా కేంద్రాల్లో ఉన్న హోటళ్ళపై దాడులు, చేసి జరిమానాలు విధించారు. దీంతో ఆము ఎలాంటి వంటకాలు తింటున్నామో చూసి ప్రజలు బెంబేలెత్తి పోయారు. పాచిపోయిన, పాడైన కుళ్లిన పదార్థాలను వండి పెడుతున్నారన్న విషయం సామాజిక మాధ్యామాల్లో జోరుగా ప్రచారం సాగింది. దాడులు చేసినా పలు హోటళ్ల తీరు మారడంలేదని తెలుస్తోంది. ఇలాంటి దాడులు రెగ్యులర్‌గా జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు. హోటళ్లు సరైన ప్రమాణాలు పాటించడంలేదని తనిఖీల్లో నిర్ధారణ అయింది. కొన్ని హోటళ్లవారు పాచిపోయిన ఆహారాన్ని పడేయడం లేదు. రాత్రి మిగిలిన దానిని రిఫ్రిజిరేటర్‌లో ఉంచి మర్నాడు ఉదయం కొత్తగా తయారుచేసిన దానిలో కలిపేస్తున్నారు. దీంతోపాటు నిల్వ ఉంచిన మాంసాన్ని వినియోగిస్తున్నారు. వంటశాలల్లో బొద్దింకలు చేరి, వండిన పదార్థాల్లో కలసిపోతున్నాయి. పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై సాంకేతిక పరిజ్ఞానంతో కఠినంగా వ్యవహరించేందుకు ప్రజారోగ్య విభాగం సిద్ధమవుతోంది. రెస్టారెంట్లు, హోటళ్లలో పరిశుభ్రతను పర్యవేక్షించే ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఇక మొబైల్ యాప్ సహాయంతో యజమానులపై చర్యలు తీసుకుంటారు. కుళ్లిన పదార్థాలు, అపరిశుభ్రంగా వంటశాలలుంటే జరిమానా విధించడంతో పాటు ట్రేడ్ లైసెన్సునూ రద్దు చేస్తారు. స్టార్ హోటళ్లు, వ్యాట్ వసూలు చేసే రెస్టారెంట్లు ప్రమాణాలు పాటించకపోతే ఆ స్థాయిలోనే జరిమానా విధించాలని పోలీస్ అధికారులు సూచించారు. ప్రస్తుతం ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు అక్కడి పరిస్థితులకు అనుగుణంగా జరిమానా విధిస్తున్నారు. ఆకస్మిక తనిఖీలు... ఏకకాలంలో వేర్వేరు ప్రాంతాలకు వెళ్లడం ద్వారా అక్రమాలను అరికట్టేందుకు వీలుంటుందని భావిస్తున్నారు.

## రమణక్కపేటలో ఆగని అక్రమ మైనింగ్

నూజివీడు నూజివీడు నియోజకవర్గం లోని ముసునూరు మండలం రమణక్కపేట గ్రామంలో అక్రమ మైనింగ్ ఆగడంలేదు. గత మూడు నెలలుగా జరుగుతున్న ఈ భాగోతం వెనుక స్థానిక వైసీపీ నాయకుడు, గ్రామ సర్పంచ్ భర్త వున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో గ్రామస్తులు అక్రమ మైనింగ్ ను అడ్డుకొని రెండుసార్లు జెసిబిని ట్రాక్టర్లను పట్టించినప్పటికీ మైనింగ్ దందా ఆగలేదు. వైసీపీ నాయకుడు స్థానిక ఎమ్మెల్యే సహకారంతో గత మూడు నెలలుగా కొండను తవ్వి గ్రావెల్ను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని చెబుతున్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం గ్రామం చుట్టుపక్కల ఉన్న కొండలను తవ్వి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి.

# బద్వేలులో చెలరేగుతున్న భూ కబ్జాదారులు



బద్వేలు , బద్వేల్ లో నకిలీ ఇంటి పట్టాలు భూకబ్జాలు వ్యవహారం ఇప్పటికే జోరుగా సాగింది నకిలీ పట్టాలు భూకబ్జాలు విషయంలో కొందరి పాత్ర కీలకంగా మారింది వీరి పాత్ర పై రెవెన్యూ పోలీసు అధికారులు ఇప్పుడు ఆరోపిస్తున్నారు వీళ్లు భూకబ్జాలు చేయడంలో నకిలీ పత్రాలు సృష్టించడంలో ఘనాపాటి అని అధికారులు భావిస్తున్నారు ఇప్పటికే నకిలీ పత్రాలతో పలు స్థలాలు కబ్జా చేసి వాటిని క్రయ విక్రయాలు జరిపి కోట్లు గడించారు ఇప్పుడు ఈ విషయం హాట్ టాపిక్గా మారింది నకిలీ పట్టాలు భూకబ్జాలు చేసే వారిపై ఇప్పటికే బద్వేల్ పట్టణ పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు ఇంకా పలువురిపై కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేశారు అధికారుల వద్ద ఇలాంటి వారి చిట్టా ఎక్కువగా ఉన్నట్లు సమాచారం దాదాపు వంద మందికి పైగా ఈ వ్యవహారంలో ఉన్నట్లు ప్రాథమిక సమాచారం రాజకీయ అండదండలతో వీరంతా గత మూడున్నర సంవత్సరాలుగా చెలరేగిపోయారు బద్వేలు గోపవరం మండలాలతో బద్వేలు పట్టణం విస్తరించింది ఈ రెండు మండలాల్లో ప్రభుత్వ భూములే ఎక్కువ శాతం ఉన్నాయి ఎంతో విలువైన ఈ భూములపై స్థలాలపై కబ్జాదారుల కన్ను పడింది నకిలీ పట్టాలు గురించి వీటిని కబ్జాదారులు చాలా వరకు స్వాధీనం చేసుకున్నారు పట్టా పొందిన హక్కుదారు నుండి బెదిరించి అనేక ప్రలోభాలకు గురిచేసి వారి హక్కులు కూడా తమ సొంతం చేసుకున్నారు భూముల ఆక్రమణలు నకిలీ పట్టాలు ఎవరు చేస్తారు అనే విషయం అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే వారు ఎవరు అనే విషయం ఇక్కడ అప్రస్తుత మైన వీరి దందా ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది బాధితులు ఎవరైనా ఉంటే నేరుగా అధికారులను సంప్రదిస్తే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు నకిలీ పట్టా తయారుచేసిన వారిపై వెంటనే పోలీస్ కేసు నమోదు చేస్తామని ఒక రెవెన్యూ అధికారి తెలిపారు బాధితులకు న్యాయం చేయడమే తమ పని అని వారు తెలిపారు బద్వేలు గోపవరం మండలాల్లో గత రెండున్నర సంవత్సరాల కాలంలో దాదాపు 500 కోట్లకు పైగా క్రయ విక్రయాలు జరిగే అంటే పరిస్థితి ఊహించడం మే కష్టంగా మారింది ఈ క్రయ విక్రయాల్లో దాదాపు 90 శాతం పైగా భూకబ్జాలు చేసినవి నకిలీ పట్టాలతో జరిగినవి వీటిని కొనుగోలు చేసిన వారు ఇప్పుడు విషయం తెలిసి బోరు బోరున విలపిస్తున్నారు ప్రభుత్వ స్థలాలు భూములు వంద రూపాయల అగ్రిమెంట్ పై క్రయ విక్రయాలు చేసుకుంటే అవి ఏమాత్రం చెల్లవని బద్వేలు ఆర్ డి ఓ ఆకుల వెంకట

రాజ్యమేలుతున్న నకిలీ పట్టాలు
ఇంటి పట్టా ఒకరిది పెత్తనం వీరిదిహక్కుదారుడికి న్యాయం చేస్తాం
రెవెన్యూ అధికారులుబద్వేలులో ఐదు వందల కోట్లకు పైగా నకిలీ పట్టాలతో వ్యాపారం
ఇప్పటికే పలువ్వురు పై కేసు నమోదు చేసిన పోలీసులు

రమణ పదే పదే చెబుతూ వస్తున్నారు చేసుకున్న అగ్రిమెంట్లు చిత్తు కాగితాల తో సమానమని ఆయన గతంలో పలుమార్లు చెప్పడంతోపాటు ఇప్పటికీ ఆయన చెబుతూ వస్తున్నారు గతములో ఇంటి పట్టా వ్యవసాయ భూములు పొందినవారు అనుభవించాలే తప్ప ఇతరులకు విక్రయిస్తే వాటిని రద్దు చేస్తామని హెచ్చరించారు నకిలీ ఇంటి పట్టాలు ద్వారానే చాలా వరకు క్రయ విక్రయాలు జరిగాయి నకిలీ ఇంటి పట్టాలు చేయడంలో పలువురు మహిళలు కూడా కీలకపాత్ర పోషించడం గమనార్హం ప్రియాంక అన్న మహిళపై పట్టణ పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేశారు బద్వేలు గోపవరం మండలాల రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు కొందరు ఇంటి దొంగలుగా మారి భూకబ్జాలు నకిలీ పట్టాలు తయారుచేసే వారికి రెవెన్యూ రికార్డుల న కళ్ళు అందజేశారు వీరిలో రాజకీయ ప్రముఖులు కూడా ఉండడం విశేషం పెద్ద మనుషులు గా చలామణి అయ్యే ఈ రాజకీయ ప్రముఖులు నకిలీ ఇంటి పట్టాలు చేసి వాటిని అడ్డుపెట్టుకొని వందల ఎకరాలు భూములు కబ్జా చేశారు ఈ విషయం అధికారుల విచారణలో బట్టబయలైంది రెవెన్యూ ఇంటి దొంగల పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు ఇద్దరు వి ఆర్ ఓ లు ఎఫ్ ఐ ఆర్ నమోదయింది అలాగే అధికార పార్టీకి చెందిన ఒక మున్సిపల్ కౌన్సిలర్ మరో మున్సిపల్ కౌన్సిల్ భర్తపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు వీళ్లు నకిలీ ఇంటి పట్టాలు భూకబ్జాలు చేయడంలో ఘనాపాటి అని చెప్పవచ్చు వీటి ద్వారానే ఇటీవల కాలంలో కోట్ల రూపాయలు గడించారని తెలుస్తుంది వీరి వ్యవహారం పై అధికారులు లోతుగా విషయాలను చేస్తున్నారు దొంగ పట్టాలతో స్థలాలు కబ్జా చేస్తున్న సమయంలో హక్కుదారులు అడ్డుపడితే నకిలీ పట్టా అడ్డుపెట్టుకొని దానిద్వారా కోర్టును ఆశ్రయించడం వీరికి పరిపాటిగా మారింది బద్వేల్ లో ఇలాంటి కేసులు చాలా వరకు ఉన్నాయి



# మండల వ్యాప్తంగా భేటీ బచావో. భేటీ పడావో

## అంగన్వాడి కార్యకర్తలు ర్యాలీలు



చెన్నూరు. జనవరి.21 ఈనెల 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా చెన్నూరు మండలం వ్యాప్తంగా అన్ని అంగన్వాడి కేంద్రాల పరిధిలో ర్యాలీలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం మండల కేంద్రమైన చెన్నూరు నాగలకట్ట వీధి. పరమట వీధి. అంగన్వాడి కేంద్రాల పరిధిలో ర్యాలీ నిర్వహించారు. బ్యానర్లు చేత పట్టుకొని ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లలను చదివిద్దాం, గృహహింస నుండి మహిళలను రక్షిద్దాం అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చెన్నూరు గ్రామ సచివాలయ మహిళా పోలీసులు. ఉ మామహేశ్వరి. చంద్రకళ. వాసవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసిందని ఇది మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ర్యాలీలు అవగాహన కార్యక్రమంలో ఐ సి డి ఎస్ సూపర్వైజర్లు నాగరత్నమ్మ. గుర్రమ్మ. అంగన్వాడి కార్యకర్తలు పి పద్మావతి. సి రాధా. తులసి. పద్మ. ఇందిరా. మాధవి. నాగరత్నమ్మ. ఏఎన్ఎం. రెడ్డమ్మ. ఆశ వర్కర్ రాజేశ్వరి పలువురు అంగన్వాడీ కార్యకర్తలు ఆశ వర్కర్లు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పిల్లలను క్రీడలలో ప్రోత్సహించాలి: ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ.



నంద్యాల ఎస్బిఐ కాలనీ లో ఉన్న భాష్యం స్కూల్ అంతర్గత క్రీడా పోటీలు ఘనంగా పద్మావతి నగర్ స్టేడియంలో నిర్వహించారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, జిల్లా క్రీడా అధికారి నరసింహ రాజు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు పిల్లలను క్రీడలలో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. క్రీడాధికారి నరసింహారాజు మాట్లాడుతూ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని,క్రీడలలో పాల్గొంటే విద్యార్థుల శారీరక, మానసిక దారుఢ్యం ఇనుమడిస్తుందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధ్యక్షులు వహించిన భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ వాణి మాట్లాడుతూ పిల్లల మనోవికాసానికి చదువుతోపాటు ఆటలు కూడా ముఖ్యమని అందుకే భాష్యం స్కూలు పిల్లలను చక్కటి చదువు తో పాటు ఆటపాటలలో కూడా ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాష్యం పాఠశాలల జోనల్ అధికారి అనిల్, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజాచక్రవర్తి,ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు. తదుపరి జరిగిన వివిధ క్రీడల పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన వారు భాష్యం పాఠశాలల మధ్య జోనల్ స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.




# అమెరికాలో బాలయ్య బాబు అదిరిపోయే కలెక్షన్లు..!



నటసింహం.. నందమూరి బాలకృష్ణ గత కొంత కాలంగా బాక్సాఫీసు వద్ద సరికొత్త రికార్డులను క్రియేట్ చేస్తున్నాడు. తాజాగా వీర సింహారెడ్డి సినిమాతో సంక్రాంతి బరిలో దిగి భాక్సాఫీసును బద్ధలు కొట్టాడు. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించాడు. ముఖ్యంగా అమెరికాలో బాలయ్య బాబుకు విపరీతమైన ఫ్యాన్స్ ఉన్నారు. ఆయన చాలా సినిమాలు అక్కడ కూడా విడదలడం భారీ స్థాయిలో కలెక్షన్లు సాధించడం పరిపాటిగా మారింది. తాజాగా వచ్చిన వీరసింహా రెడ్డి అమెరికాలో 1.04 మిలియన్ డాలర్ల గ్రాస్ కలెక్షన్ల రాబట్టి సరికొత్త రికార్డు సృష్టించింది. ఇది అన్ని సినిమాలకంటే ఈ సినిమాకే పెద్ద మొత్తంలో కలెక్షన్లు వసూలు అయ్యాయి. అలాగే నందమూరి బాలకృష్ణ కెరియర్ లో అఖండ సినిమా మొన్నటి వరకు అత్యధిక కలెక్షన్లు అందుకున్న సినిమాగా నిలిచింది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా అమెరికాలో రిలీజ్ అయి 1 మిలియన్ డాలర్ల కలెక్షన్లను సాధించింది. అంతకు ముందు నందమూరి తారక రామారావు జీవితం ఆధారంగా తెరకెక్కిన ఎన్టీఆర్ బయోపిక్.. ఎన్టీఆర్ కథానాయకుడు సినిమా కూడా బాగానే ఆడింది. ఆయన జీవిత చరిత్ర గురించి తెలుసుకునేందుకు కొందరు సినిమాను చూడగా.. బాలకృష్ణ తండ్రి పాత్రలో ఎలా కనిపించారో తెలుసుకునేందుకు మరికొందరు సినిమాను చూశారు. సినిమా ఎలా ఉందనే విషయం పక్కన పెడితే.. యూఎస్ లోనూ ఈ సినిమా భారీ కలెక్షన్లనే సాధించింది. 928 వేల డాలర్ల గ్రాస్ కలెక్షన్లు సాధించింది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా 2014లో విడుదలైన లెజెండ్ సినిమా సూపర్ డూపర్ హిట్టుగా నిలిచింది. సింహ తర్వాత బోయపాటి శ్రీను బాలయ్య బాబు కాంబోలో వచ్చిన ఈ సినిమాలో రాధిక ఆప్టే సోనాలీ జగపతి బాబు ముఖ్య పాత్రలు పోషించారు. దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. ఈ సినిమా కూడా అమెరికాలో రిలీజ్ అయి 420 వేల డాలర్ల కలెక్షన్లను వసూలు చేసింది. తెలుగు రాష్ట్రాల్లోనే కాదండోయ్.. బాలయ్య బాబుకు బయట దేశాల్లో కూడా ఫ్యాన్స్ గట్టిగానే ఉన్నట్లు ఈ కలెక్షన్లను చూస్తేనే అర్థం అవుతోంది.




# మెగాస్టార్ బాక్సాఫీస్ ట్రాక్.. ఇది న్యూ రికార్డ్!

మెగాస్టార్ చిరంజీవి హీరోగా రవితేజ ప్రధాన పాత్రలో రూపొందిన వాల్తేరు వీరయ్య సినిమా జనవరి 13వ తేదీని విడుదలైన సంగతి తెలిసిందే. సంక్రాంతి సందర్భంగా విడుదలైన ఈ సినిమా కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ఈ సినిమా విడుదలై వారం రోజుల పూర్తి థియేట్రికల్ రన్ పూర్తయింది.



మొత్తం మీద ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా వాల్తేరు వీరయ్య సినిమా 96.46 కోట్ల షేర్ వసూలు చేయగా... 160.45 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. అయితే ఆచార్య సినిమా భారీ డిజాస్టర్ అయిన తర్వాత విడుదలైన గాడ్ ఫాదర్ సినిమా కూడా పెద్దగా వసూళ్లు తీసుకురాకపోవడంతో వాల్తేరు వీరయ్య సినిమా మీద అందరి ఆసక్తి నెలకొంది. ఈ సినిమా అందరి అంచనాలను దాటేసి మరీ వసూళ్ల వర్షం కురిపిస్తోంది. అయితే మెగాస్టార్ చిరంజీవి చివరి నాలుగు సినిమాల మొదటి వారం వసూళ్లు ఎలా ఉన్నాయి అనే విషయం మీద ఒకసారి లుక్ వేసే ప్రయత్నం చేద్దాం. ముందుగా వాల్తేరు వీరయ్య సినిమా కంటే ముందు విడుదలైన గాడ్ ఫాదర్ సినిమా వారం రోజుల్లో 53.10 కోట్ల షేర్ 96.35 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఈ సినిమాకి పాజిటివ్ టాక్ వచ్చినా... ఎందుకో ప్రేక్షకులు థియేటర్లకు వచ్చి చూసేందుకు ఆసక్తి చూపించలేదు. అందుకే సినిమా వసూళ్ల మీద భారీ ఎఫెక్ట్ పడింది.. ఇక అంతకు ముందు రిలీజ్ అయిన ఆచార్య సినిమా మొదటి రోజు వసూళ్లు బాగానే వచ్చాయి. మెగాస్టార్ చిరంజీవి రామ్ చరణ్ కాంబినేషన్ సినిమా కావడంతో సినిమా అద్భుతంగా ఉంటుందని మొదటి రోజు బుకింగ్స్ అందరూ చేసుకున్నారు. అయితే మొదటి ఆట నుంచి డిజాస్టర్ టాక్ రావడంతో రెండో రోజు సినిమా బుకింగ్స్ దారుణంగా పడిపోయాయి. దీంతో వారం రోజులపాటు ఈ సినిమా కేవలం 43.87 కోట్ల షేర్ 75.05 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టింది. ఇక అంతకు ముందు విడుదలైన సైరా నరసింహారెడ్డి సినిమా విషయానికి వస్తే మొదటి వారం రోజుల్లో 115.38 కోట్ల షేర్ 188.5 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇక ఈ సినిమా కంటే ముందు విడుదలైన ఖైదీ నెంబర్ 150 సినిమా 77.32 కోట్లు షేర్ 111.50 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. అయితే ఈ అన్ని సినిమాలను కంపేర్ చేసుకుంటే సైరా నరసింహారెడ్డి సినిమాకి ఎక్కువ వసూళ్లు వచ్చినా... అది పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్ అయ్యింది. అయినా అన్ని భాషల కలెక్షన్లు కలుపుకొని 115 కోట్లు వచ్చాయి. కానీ ప్రస్తుత సినిమా మాత్రం తెలుగు హిందీ వర్షన్ లోనే విడుదలై ఈ మేర వసూళ్లు రాబట్టడం గమనార్హం.

# రిటైర్మెంట్ ప్రకటించిన ఆసీస్ సీనియర్ క్రికెటర్



ఆస్ట్రేలియా పరిమిత ఓవర్ల స్పెషలిస్ట్.. సీనియర్ ఆల్‌రౌండర్ డాన్ క్రిస్టియన్ ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం బిగ్‌బాష్ లీగ్‌లో సిడ్నీ సిక్సర్స్‌కు ఆడుతున్న డాన్ క్రిస్టియన్..తనకిదే చివరి టోర్నీ అని ట్విటర్ వేదికగా ప్రకటించాడు. బీబీఎల్ సీజన్ ముగిసిన తర్వాత ఆటకు వీడ్కోలు పలుకుతున్నట్లు స్పష్టం చేశాడు. "ఇన్నాళ్లు ఆస్ట్రేలియా తరపున అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించడం గొప్ప విషయమని.. అలాగే బీబీఎల్, ఐపీఎల్, కరీబియన్ ప్రీమియర్ లీగ్, బంగ్లా ప్రీమియర్ లీగ్ లాంటి ప్రైవేటు లీగ్స్‌లోనూ పాల్గొనడం సంతోషాన్ని ఇచ్చిందని" తెలిపాడు. ఇక డాన్ క్రిస్టియన్ ఆస్ట్రేలియా తరపున 2010లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. ఆసీస్ తరపున పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మాత్రమే ఆడిన క్రిస్టియన్ ఓవరాల్‌గా 20 వన్డేలు, 23 టి20 మ్యాచ్‌లు ఆడాడు.

లోయర్ ఆర్డర్‌లో పవర్‌ఫుల్ హిట్టర్‌గా పేరు పొందిన డాన్ క్రిస్టియన్ మీడియం పేస్ బౌలింగ్ కూడా చేయగలడు. వన్డేల్లో 270 పరుగులతో పాటు 20 వికెట్లు, టి20ల్లో 118 పరుగులతో పాటు 13 వికెట్లు పడగొట్టాడు. 2021 తర్వాత డాన్ క్రిస్టియన్ ఆసీస్ తరపున మరో మ్యాచ్ ఆడలేదు. 2007-08లో ఫస్ట్‌క్లాస్ కెరీర్ ఆరంభించిన డాన్ క్రిస్టియన్ లిస్ట్-ఏ తరపున 124 మ్యాచ్‌లు, 399 టి20 మ్యాచ్‌లు ఆడాడు. ఇక బిగ్‌బాష్ లీగ్‌లో మంచి ఆల్‌రౌండర్‌గా పేరు పొందిన డాన్ క్రిస్టియన్ బ్రిస్బేన్ హీట్, సిడ్నీ సిక్సర్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఇక ఐపీఎల్‌లో డెక్కన్ చార్జర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ), ఢిల్లీ డేర్‌డెవిల్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190